తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం. సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం రాత్రి స్వామివారి అమ్మవార్లకు గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గురువారం ఉదయం గోకులాష్టమి వేడుకలను దేవస్థానం గోశాలలో ఉదయం ఘనంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి గ్రామోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీదుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## పుష్కరిణి హారతి పున:ప్రారంభం



తిరుమల, సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:
బ్రహ్మోత్సవాల ముందు దేవదేవుడు శ్రీమలయప్పస్వామి సాయంత్రంసహస్రదీపాలంకార సేవ అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఊరేగి పుష్కరిణి వద్దకు రాగానే హారతి ఇవ్వడం సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని గురువారం సాయంత్రం ఆలయ అర్చకులు పున:ప్రారంభించారు. పుష్కరిణి మరమ్మతులు పూర్తిచేసి పవిత్రమైన తీర్థాలతో నింపడంతో పుష్కరిణి ప్రారంభమైంది. గురువారం సాయంత్రం స్వామివారి ఊరేగింపులో హైకోర్టు జడ్జి జస్టిస్ సోమయాజులు పాల్గొన్నారు.

# కృష్ణం వందే జగద్గురుం! కృష్ణ...కృష్ణ శరణం మమ!!

### వైభవంగా గోకులాష్టమి ఆస్థానం



తిరుమల, సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని గురువారం ఉదయం గోవిందుని ఆలయంలో శాస్త్రోక్తంగా జరిపారు. బంగారువాకిలిలో రాత్రి 8గంటలనుండి 10గంటల వరకు ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమిలో భాగంగా ఉదయం గోగర్భండ్యామ్ వద్దవున్న ఉద్యానవనంలోని కాళీయమర్ధనుడు శ్రీకృష్ణునికి పంచాభిషేకాలు చేశారు. అక్కడ ఉట్లోత్సవం జరిపించారు.

## ఎస్వీగోశాలలో

### తలపాగా చుట్టి...పాలుపితికిన ఛైర్మన్ కరుణ



తిరుమల, సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:
గోకులాష్టమి పర్వదినాన గురువారం ఉదయం తిరుపతిలోని ఎస్వీగోశాలలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. దేశవాళీ గోవులను టిటిడి ప్రోత్సహిస్తోందని, కేంద్రప్రభుత్వం రెండు రోజులముందే 40కోట్ల రూపాయలు గ్రాంట్‌ను గోశాలకు మంజూరుచేయడం సంతోషవిషయం. గోవులను రక్షించుకోవాలని, గోమాతలకు పూజ చేస్తే ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో ఉంటుందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గోకులాష్టమి సందర్భంగా సాంప్రదాయ దుస్తుల్లో తలపాగా చుట్టి గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. దాణా తినిపించి పాలుపితికారు. ఇక్కడే గజరాజు ఆశీర్వాదం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాధరెడ్డి .సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగైన ప్రజారోగ్యమే

# జగనన్న లక్ష్యం

### 15న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ ప్రారంభం
### జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త
ప్రజల మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శ్రీహరి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు జయలక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారులు సుశీల దేవి, జిల్లా విద్యా శాఖాధికారి శేఖర్ తదితర సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని అందరు ఆర్డిఓలు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, ఎంఈఓ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం రాష్ట్ర అధికారులచే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులు బాధ్యతలపై శిక్షణ ఉంటుందని హాజరు కావాలని సూచించారు. ఈ నెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్యాంపెయిన్ ప్రారంభం అవుతుందని, వాలంటీర్లు క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని గృహ సందర్శన చేసి ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి యాప్ నందు ఆరోగ్య వివరాలు నమోదు చేసి, ఏఎన్ఎం, సిహెచ్‌సి వైద్య అధికారులు సందర్శన తేదీలను వారికి తెలియజేయాలన్నారు. ఈ నెల నాటికి ఆరోగ్య సురక్ష బ్రోచర్ అందించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ తేదీలు తదితర వివరాలు వాలంటీర్లు తెలిపేలా ఉండాలని, ఈ నెల 16నుండి ఏఎన్ఎంలు గృహ సందర్శనలో అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి రిపోర్టులు వైద్య శిభిరాల నాటికి, డాక్టర్లకు అందుబాటులో ఉండేలా సిద్ధం చేయాలన్నారు. వైద్య శిభారాలు క్షేత్ర స్థాయిలో ఈ నెల సెప్టెంబర్ 30 నుండి ప్రారంభం అవుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో డిఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిఈవో వి. శేఖర్, డిపిఎంఓ శ్రీనివాసులు, జిల్లా ఆరోగ్య శ్రీ సమన్వయకర్త రాజశేఖర్ రెడ్డి జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారిని సుశీల దేవిలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### -గోశాలలో వైభవంగా గోపూజ



కాణిపాకంలో గోశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు, పూజా సామాగ్రి ప్రధాన ఆలయం నుడి ఊరేగింపుగా తీసుకువెళుతున్న అధికారులు, ఉభయదారులు.

కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:
శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకంలో ప్రతి ఏటా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఈకార్యక్రమంను దేవస్థానం గోశాలలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్, రాజేంద్ర యాదవ్, దేవరాజుల యాదవ్, రేణుగోపాల్ యాదవ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు ఉత్సవ ఉభయదారులు, ఆలయ ఛైర్మన్, ఈఓ, అధికారులు తదితరులు ప్రధాన ఆలయం నుండి పూజాసామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోశాలకు తీసుకువచ్చారు. అనంతరం గోశాల వద్ద శ్రీకృష్ణుని విగ్రహంతో పాటు గోమాత చిత్రపటాలను వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలోని గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు గోమాతలకు సంప్రదాయబద్దంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతలకు ఛైర్మన్, ఈఓలు ఆలయ అధికారులతో కలసి మేతను అందించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్‌లు రంగస్వామి, కోదండపాణి, ఉత్సవ ఉభయదారులు, ధనంజయ యాదవ్, రాజేంద్రయాదవ్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.ఇదిలా వుండగా గోకులాష్టమి సందర్భంగా ఉట్టి గొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యమ్రంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఉభయదారులు పాల్గొని ఉట్టి కొట్టారు.

## భక్తుల భద్రతకు మరింత అప్రమత్తత

### -ఐదవ చిరుత బంధీ

తిరుమల, సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:



కాలినడక మార్గంలో భక్తితో తిరుమలకు వచ్చే భక్తుల భద్రతకు టిటిడి అధికారులు మరింత అప్రమత్తతతో వ్యవహరిస్తారని, అవసరమైన జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధమయ్యారని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. తాజాగా బుధవారం అర్ధరాత్రి ఏడవమైలు దాటిన తరువాత ఏనుగుల ఆర్చి మధ్య అడవిలో ఏర్పా టుచేసిన బోనులో మగచిరుత బంధీ అయ్యింది. దీన్ని గురువారం ఉదయం తిరుపతి ఎస్వీజంతుప్రదర్శనశాలలోని క్వారంటైన్‌కు అటవీ అధికారులు తరలించారు. చిరుత బంధీ అయిన ప్రాంతాన్ని గురువారం ఉదయం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం, సిసిఎఫ్ నాగేశ్వరరావు, డిఎఫ్ఒ సతీశ్‌రెడ్డి, టిటిడి డిఎఫ్ఓ శ్రీనివాసులు పరిశీలించారు.

## శ్రీకళ్యాణ వెంకన్న ఆలయంలో

# వైభవంగా ఉట్లోత్సవం

తిరుపతిరూరల్,
సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



తుమ్మలగుంట శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా గర్భాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం ముందు ఉట్టికట్టి ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఉట్టికోట్టే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఏడాది కృష్ణాష్టమికి ఆలయం వద్ద ఉట్లోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ ఉట్లోత్సవాన్ని పెద్దఎత్తున భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని, తిలకించారు. తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉట్టికొట్టడానికి పిల్లలను ప్రోత్సహిస్తూ,, వారితో సరదాగా గడిపారు.

## కలెక్టరేట్‌లో

## తలపిస్తున్న మినీ స్విమ్మింగ్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త
పేరుకే జిల్లా కలెక్టరేట్ కానీ కలెక్టరేట్‌లో మినీ స్విమ్మింగ్ తలపిస్తుంది. అక్కడ సౌకర్యాలు చూస్తే జిల్లా ప్రజలు, అధికారులు జడుసుకోవాల్సిందే.. నూతన కలెక్టరేట్ భవనంలో మూడవ అంతస్తులోని వరండాలో వర్షం పడితే వర్షపు నీరు నిలిచి మిని స్విమ్మింగ్ పూల్‌లా మారింది. ఇక్కడకు ప్రతి రోజు జిల్లాలోని అధికారులు, జిల్లాల ప్రజలు వస్తుంటారు. పైగా ప్రతి సోమవారం స్పందన జరుగుతుంది. ఇక్కడ నీరు నిలిచి పాచి పట్టింది. శుభ్రతకు మారు పేరైన కలెక్టరేట్‌లో ఇలా చెరువును తలపించడం దేనికి నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో వరండాలో వర్షపు నీరు నిలిచిన దృశ్యం



## జీతాల కోసం

## ద్రవిడ తాత్కాలిక ఉద్యోగుల ధర్నా

### - పరిపాలన భవనం ఎదుట బైఠాయింపు



. ద్రవిడ వర్సిటీ పరిపాలన భవనం వద్ద బైఠాయించిన ఉద్యోగులు

కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త
ద్రవిడ విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉద్యోగులు మరలా వేతనాల కోసం ధర్నాకు దిగారు. గురువారం వర్సిటీలోని ప్రధాన పరిపాలన భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఏడాది కాలంలో తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని వాపోయారు. ఇదివరకే మూడు నెలల వేతనాలకై 53రోజులు సమ్మె చేపడితే జీతాలు ఇచ్చారని అయితే మరలా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి వేతనాలను చెల్లించలేదని పేర్కొన్నారు. తమకు వేతనాలు అందేంతవరకు పరిపాలన భవనంలోనికి ఎవర్నీ అనుమతించేది లేదని పేర్కొన్నారు. వర్సిటీలో అన్ని రకాల సహాయ నిరాకరణ చేస్తామన్నారు. ఉద్యోగుల ధర్నాతో పరిపాలన భవనంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కాగా తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించి రెండు రోజుల్లో ఖచ్చితంగా వేతనాలు చెల్లిస్తామని రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే వేతనాలు అందేవరకు నిరసన తెలుపుతామని ఉద్యోగులు తెగేసి పేర్కొన్నారు.

## కారు పార్కింగ్ విషయమై ఘర్షణ

### భార్యాభర్తలపై కత్తితో దాడి

ఐరాల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:
కారు పార్కింగ్ స్థలం వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణ సందర్భంగా భార్యాభర్తలపై కత్తితో దాడి చేసి గాయపరచిన సంఘటన ఎగువ కామినాయనిపల్లె గురువారం చోటు చేసుకుంది. ఐరాల ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని ఎగువ కామినాయనిపల్లె గ్రామంలో రాంబాబు, నవీన్‌లకు మధ్య కారు పార్కింగ్ స్థలం విషయమై వివాదం వుంది ఈనేపథ్యంలో గురువారం ఈవిషయమై ఇరువర్గాలు ఘర్షణ పడడంతో నవీన్ కత్తితో రాంబాబు, ఆయన భార్య వరలక్ష్మీపై దాడి చేసి నరికాడు. దీనితో భారాభర్తలిద్దరు తీవ్రంగా గాయపడడంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం రాణీపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రెస్ట్ రెస్సింగ్ పనులను పరిశీలించిన కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త
శ్రీనివాస సేతు చివరి దశ పనుల్లో జరుగుతున్న ప్రెస్ట్ రెస్సింగ్ పనులను నగర పాలక సంస్థ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఎండి హరిత అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీనివాస సేతుపై జరుగుతున్న పనులను ఆమె పరిశీలిస్తూ ఈ నెల 15 లోపు అన్ని పనులు పూర్తి చేయాలని ఈ నెల 18వ తేది ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్నీ ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా ప్రెస్ట్ రెస్సింగ్ పనులను మరోమూడు రోజుల్లో పూర్తి చేసి తారు రోడ్డు పనులను చేపట్టాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ పనుల వేగవంతానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీనివాస సేతుపై ఆకర్షణియమైన లైటింగ్లు ఏర్పాటు చేయాలని, చక్కని సుందరీకరణ పెయింటింగ్స్ వేయించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్, సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.





నారాయణవనంలో పుష్పపల్లకీలో ఊరేగుతున్న అవనాక్షమ్మ అమ్మవారు



ఆకట్టుకుంటున్న రాధాకృష్ణుల అక్రీలిక్ రంగుల చిత్రం

4లో

## నేడు తిరుపతిలో సిపిఐ ర్యాలీ, బహిరంగ సభ

### హాజరుకానున్న జాతీయ, రాష్ట్ర నాయకులు.. భారీ ఏర్పాట్లు

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త
కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక పాలన పై ప్రజా చైతన్యం కోసం, ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సిపిఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం బస్సు యాత్ర ముగింపు ర్యాలీ, బహిరంగ సభ తిరుపతిలో జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ కాలనీ నుండి భారీ ప్రదర్శన ప్రారంభం కానుంది. సాయంత్రం మూడు గంటలకు నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరగనుంది.. ఈ కార్యక్రమానికి తిరుపతి నగరంలో భారీ ఏర్పాట్లు చేశారు. ర్యాలీ జరిగే ప్రధాన రహదారులు కూడళ్లలో పార్టీ కటౌట్లు, బ్యానర్లతో అలంకరించారు. నగరం మొత్తం సిపిఐ తోరణాలతో ఎరుపెక్కించారు. సభా ప్రాంగణంలో వేదిక, వద్ద చలువ పందిళ్ళు, కుర్చీలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు భోజనాలు, తాగు నీరు వంటివి ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగే ముగింపు సభకు ముఖ్య అతిధులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శులు నారాయణ, సిపిఐ పార్లమెంట్ సభ్యులు వినయ్ విశ్వం, సిపిఐ రాష్ట్ర



కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు. ఈ భారీ బహిరంగ సభ రాష్ట్ర నలువైపుల నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.

## రెస్కోఛైర్మన్‌చే కుంబాభిషేక పనులు పరిశీలన

కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేకం ఈనెల 11-13 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో గురువారం కుప్పం రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంధిల్ కుమార్ ఆలయం వద్దకు చేరుకుని కుంబాభిషేకం ఏర్పాట్లను పరిశీలించారు. చేపట్టనున్న కార్యక్రమాలపై వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యశాస్త్రితో చర్చించారు. కుంబాభిషేకంకు భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో జడ్పీటిసి కృష్ణమూర్తి, కో కన్వీనర్ రామూర్తి, సర్పంచ్ అమరనాథ్, మాజీ సర్పంచ్ గోవిందన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటేపోటీల్లో మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ.

పెద్దపంజాణి సెప్టెంబర్ 07 ప్రభాతవార్త :



కర్నూలులోని ఎస్.ఎల్.ఎన్ గార్డెన్స్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటేపోటీల్లో స్థానిక మదర్‌థెరిసా (సిబిఎస్ఈ) పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభచూపినట్లు మదర్‌థెరిసా విధ్యాసంస్థల అధినేత,పాఠశాల కరస్పాం డెంట్ రవీంద్రబాబు తెలిపారు. 2వతరగతి నుండి 8వతర గతి విద్యార్థి,విద్యార్థినిలు 36మంది ఈపోటీల్లో పాల్గొన్నారని కటా మరియు కుమితే భాగాల్లో 16బంగారు పథకాలు,18రజిత పథకాలు,20కాంస్య పథకాలు తమవిద్యార్థులు సాధించారని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కరాటేపోటీల్లో రానించిన విద్యార్థులను అభినందించారు.అలాగే కరాటే మాస్టర్ డా॥సదాశివ కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలోపాఠశాలడీన్ డా॥వై.మధుసూధన్ రెడ్డి,ప్రిన్సిపాల్ డా॥డేవిడ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పక్కాగా ఉపాధి పనులు

పాలసముద్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



ఉపాధిహామీ పనులను కూలీలతో పక్కాగా చేయిం చాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని శ్రీకావేరిరాజపురం పంచాయతీలో ఉపాధి పనులను గురువారం ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ శ్రీకావేరిరాజపురం పంచాయతీ పరిధిలో 150 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సివుండగా ప్రస్తుతం కేవలం 46 మంది కూలీలు మాత్రమే పనులు చేస్తున్నారని వారం రోజుల్లో మిగిలిన కూలీలకు పనులు కల్పించకుంటే చర్యలు తీసుకొంటామని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. అలాగే ఆగస్టు నెలలో ఆముదాల, బాలకృష్ణాపురం, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, శ్రీకావేరిరాజపురం, సింహరాజపురం, కృష్ణజిమ్మపురం పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పనిదినాల పురోగతి తక్కువగా వుండటంతో వారికి నోటీసులు జారీ చేశారు. అనంతరం ఎంపిడిఓ కృష్ణజిమ్మాపురం గ్రామ సచివాలయంను తనిఖీ చేసి వంద శాతం సిబ్బంది విధులకు హాజరై ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించిన ఎంపిడిఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ మార్గరేట్, టెక్నికల్ అసిస్టెంట్ అనూష, ఫీల్డ్ అసిస్టెంట్ లోకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యా సామాగ్రి, పేట్లు పంపిణీ

వెదురుకుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



విద్యార్థులకు ఉపాధ్యాయురాలు లీలావతి ఉచితంగా విద్యా సామాగ్రి, మధ్యాహ్న భోజనం కొరకు పేట్లు పంపిణీ చేశారు. దేవళంపేట ప్రాథమిక పాఠశాల టీచర్ లీలావతి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం కొరకు వారికి అవసరమైన వస్తుసామాగ్రి అందజేశారు. విద్యార్థులు వసతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మెన్ ఉమాపతి, సీఆర్‌పి సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలు సిఎం జగనన్నతోనే సాధ్యం

– ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



సంక్షేమ పథకాల అమలు సిఎం జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, కౌన్సిలర్ గణపతి అధ్వర్యంలో పలార్లపల్లిలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్దిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్సీ భరత్, ఛైర్మన్ డా॥ సుధీర్‌లకు కౌన్సిలర్ గణపతి, మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, కౌన్సిలర్ నాగరాజు, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## డికెపల్లిలో ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత వైద్య శిబిరం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి డికెపల్లిలో ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత వైద్యశిబిరంను నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 160మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. కాగా వైద్య శిబిరంకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కౌన్సిలర్లు వేలు, సోమశేఖర్, మాజీ సర్పంచ్ మణి, ఏరియా ఇన్‌చార్జ్ రవి, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, నేతలు సోమశేఖర్, శివ, గని ఉల్లా, పిఎస్ సతీష్, నరేష్, డివి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

శాంతిపురం,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



మండలంలోని పెద్ద బొమ్మనపల్లిలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో అర్చకులు కాశీశాస్త్రి, ధర్మకర్త హరినాథ్‌రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు అండగా చంద్రబాబు

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



మహాశక్తి పథకాలతో రాష్ట్రంలోని మహిళలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అండగా నిలుస్తారని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం డికెపల్లిలో మహాశక్తి పథకాల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–59ఏళ్ల మహిళలకు ప్రతినెలా రూ 1500లు, తల్లికివందనం పేరిట ప్రతి చదివే పిల్లవాడికి 15వేలు, ఏటా రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ మణి, నేతలు శివకుమార్, పిఎస్ సతీష్, నరేష్, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పునాదులకే పరిమితమైన అంబేద్కర్ భవనం

వి.కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



వి.కోట పట్టణంలో డా॥ అంబేద్కర్ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. సుమారు రెండు కోట్ల రూపాయల నిధులు భవన నిర్మాణంకు మంజూరు కాగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో భవనం కోసం స్థలం కేటాయించారు. అయితే భవన నిర్మాణం కేవలం పునాదుల వరకే సాగింది. అనంతరం ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. భవనం కోసం కేటాయించిన స్థలం కూడా అన్యాక్రాంతమవుతోందని దళిత నేతలు వాపోతున్నారు. భవన నిర్మాణం ముందుకుసాగక పోవడంతో ఆ ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఐరాలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఐరాల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు గరువారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఈమేరకు మండలంలోని గొల్లపల్లె, జి.మిట్టూరు, కలికిరిపల్లె, ఇరువారపల్లె, ఐరాల,యల్లంపల్లె, ముదిగోళం, నాగంవాండ్లపల్లె, కాణిపాకం, చిన్నవెంకటంపల్లె తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాలు, ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. మందిరాలను సర్వాంగసుందరంగా అలకంరించి పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాలు, ప్రత్యేకబాణసంచా పేలుళ్ళ నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అలాగే ప్రతి ఇంటిలోనూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలావుండగా మండలంలోని చిన్నవెంకటంపల్లెగ్రామంలోజరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టీడీపీ పూతలపట్టు ఇన్‌చారి ్జ మురళీమోహన్, మండల అధ్యక్షుడు మల్లారపల్లి గిరిధర్‌నాయుడు,మాజీ జడ్పీటీసీ లత, నాయకులు హరిబాబునాయుడు తదితరులు పాల్గొని శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## నేడు ఐరాలలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం

ఐరాల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రం ఐరాలలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంను శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు ఈకార్యమ్రంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాస్థా ్ధయి అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు. అలాగేప్రజలుఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడాసామాగ్రి విరాళం

ఐరాల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



మండల కేంద్రం ఐరాల జడ్పీ ఉన్నతపాఠశాలకు దాతలు గురువారం సుమారు 20 వేల రూపాయలు విలువగల క్రీడాసామాగ్రిని విరాళంగా అందజేశారు. చిత్తూరు స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్యామలాదేవి ఐరాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ రవీంద్రారెడ్డి, స్పదన ఫౌండేషన్ వ్యవస్థ సభ్యులు జ్ఞానప్రసాద్, శైలజ రిటైడ్ హెచ్ఎం గిరిజ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి ఘనంగా సత్కారం

తవణంపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండలంలోని స్వస్థిక్‌నగర్ పాఠశాలలో పనిచేస్తున్న టి.పెద్దబ్బరెడ్డిని గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పెద్దబ్బరెడ్డి అవార్డు అందుకున్నారు. ఈమేరక అవార్డు గ్రహీతకు పాఠశాల ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు శరణ్‌శేఖర్, నాగరాజ్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇంటింటికి థామస్ కార్యక్రమం విజయవంతంకు కృషి

పాలసముద్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

మండలంలోని నరసింహాపురం పంచాయతీ టిఎన్ఆర్ పురం గ్రామంలో శుక్రవారం జరుగనున్న ఇంటింటికి థామస్ కార్యక్రమంను విజయవంతం చేయాలని తెలుగుదేశం ప్రభావశీల గుర్తింపు కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్ళాలని నిర్ణయించి పార్టీ అధిష్టానం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలుగుదేశం పార్టీ మెనిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి రానున్న ఎన్నికల్లో దేశం అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలిపించడానికి కృషి చేయాలన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:



అక్టోబర్ 4, 5 తేదీలలో వెంకగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తుల దర్శనానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 23వ వార్డు గాజుల వీధి, పల్లె వీధిలలో రామ్‌కుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాన్య భక్తులకు గత మూడు సంవత్సరాల నుండి దర్శన భాగ్యం సక్రమంగా కలగలేదని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. పోలేరమ్మ జాతరను సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా గుర్తించినందు వలన అంగరంగ వైభవంగా జాతరను నిర్వహిస్తామన్నారు. అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు రాకుంటే వెంటనే ఇప్పిస్తామని తెలిపారు. సైడ్ కాలువలు కావాలని, నిర్మితమైన టిడ్కో గృహాలు ఇవ్వాలని రామ్‌కుమార్‌రెడ్డిని స్థానికులు కోరారు. విజయదశమికి గృహాలు ఇస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, కౌన్సిలర్లు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, నారాయణ, వహీదా, విజయలక్ష్మీ, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన సీఎం జగన్

– కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



రాష్ట్రంలో ప్రజల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా విస్మరించారని, కేవలం బటన్లు నొక్కడానికే పరిమితమయ్యారని కేంద్ర మాజీమంత్రి డాక్టర్ చింతా మోహన్ ఆరోపించారు. గురువారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాళా తీయించారని, 9 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు భూకబ్జాలు, ఇసుక, మట్టి దందాలతో దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విక్రయిస్తున్న మద్యం బ్రాండ్లు అన్నీ సిఎం జగన్‌వే అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రధాని మోడీ ఇంటికి, సీఎం జగన్ ఇడుపులపాయకు పోవడం తథ్యమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై 50 వేల కోట్ల మేరకు భారం మోపారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**వాకాడులో**

వాకాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి జరిగిందని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పలాలు అభివృద్ధి చెందారని కేంద్ర మాజీ మంత్రి తిరుపతి మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ అన్నారు. గురువారం వాకాడులో ఆయన పర్యటించారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మాతృత్వ పార్టీ ప్రభుత్వం వలన భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు పోలేక పోతుందని, నిరుద్యోగ సమస్య తీవ్ర తరమవుతుందన్నారు. వెంకటగిరి కాంగ్రెస్ ఇంచార్జి పంట శ్రీనివాస రెడ్డి, పూల చంద్రశేఖర్, తిరుమూరు మస్తానయ్య, భాస్కర్ రెడ్డి, దయాకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంటింటి తిరిగి కాంగ్రెస్ కరపత్రాలను అందజేసారు.

## ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రముఖ బహుళజాతి కంపెనీ ఫ్లోసెసర్వ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నలుగురు మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థులను విజయకుమార్‌రెడ్డి అభినందించారు. సుభాష్, ప్రసాద్, ప్రశాంత్, చేతనసాయిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ఆర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో సాఫ్ట్‌వేర్ రంగం ఆర్థికమాంద్యం కారణంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో మెకానికల్ విద్యార్థులకు 6.5 లక్షల వార్షిక వేతనంతో తమ విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## మసీదుల అభివృద్ధికి సీఎం జగన్ హామీ

– ముతవల్లి అధ్యక్షుడు మొబిన్‌బాషా

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా 5500 మసీదుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గూడూరు నియోజకవర్గం ముతవల్లి అధ్యక్షుడు మొబిన్‌బాషా తెలిపారు. గురువారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 5500 మసీదులు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఆ మేరకు రూ.200 కేటాయిస్తామని ప్రకటించారని మొబిన్‌బాషా గుర్తు చేశారు. అందులో భాగంగా రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాదర్‌బాషా, జోనల్ ఇన్‌ఛార్జ్ హంజాహుస్సేన్ కలిసి వాకాడు మండలంలోని 11 మసీదులను పరిశీలించారని తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నజీర్, జిలాని, ఇంతియాజ్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## కోటలో ఎంఇఓ ఆకస్మిక తనిఖీలు

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



కోటలోని ఎంపియూపి ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిశితంగా పరిశీలించారు. మెనూ ప్రకారం వంట తయారు చేసినందుకు నిర్వాహకులను, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. హెచ్ఎం ప్రమీల తదితరులు ఉన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ విజయవంతం చేయాలి

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త

ప్రజలకు మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్యాంపెయిన్ ప్రారంభమవుతుందని తెలిపారు. వాలంటీర్లు క్షేత్రస్థాయిలో వారి పరిధిలో గృహ సందర్శన చేసి ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేసి తెలియజేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓ భవాని, తహశీల్దార్ పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

– పీడీ శ్రీనివాసులు

బాలాయపల్లి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:



ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని పీడీ శ్రీనివాసులు హెచ్చరించారు. యాచవరం గ్రామంలో రూ. 5 లక్షలతో జరుగుతున్న స్టోరేజ్ ట్యాంకు పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోరేజ్ ట్యాంక్ పనులను కొలతల ప్రకారం, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టోరేజ్ ట్యాంక్ వలన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు.

## వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

బాలాయపల్లి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిలమానూరు గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో మరలా గెలిచి జగన్మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు సీఎం పేదలకు అందిస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆయన వెంట ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, గోపికృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులందరికీ ఉద్యోగం కల్పించేందుకే మెగా జాబ్ మేళా

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:

ఈ నెల 8వ తేది వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో బడా కంపెనీల వారు జాబ్ మేళాకు వచ్చి అవసరమైన నిరుద్యోగులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా ఒరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకురావాలని చెప్పారు. అలాగే వారికి భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శిక్షణ

దొరవారిసత్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో తహాశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపిడిఓ శింగయ్య, మండల అధికారులు, సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లావణ్య

దొరవారిసత్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త




తిరుపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పోతు రాజు లావణ్య ఎంపికయ్యారు. దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూలులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పోతురాజు లావణ్యను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిల చేతుల మీదుగా లావణ్య అవార్డు అందుకున్నారు. పోతురాజు లావణ్య పాఠశాలలో తక్కువ సీఎల్‌లు పెట్టి పాఠశాల నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా వెళ్లడం, ఆమె బోధించే సబ్జెక్టులో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమెను సత్కరించింది. దీంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## అక్వా ఫీడు షాపులపై ఆకస్మిక తనిఖీ

చిల్లకూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త



చిల్లకూరు గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయి రాం అక్వా ఫీడు షాపును గురువారం మత్స్య శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏలాంటి అనుమతులు లేకుండా, మరియు కాల పరిమితి చెందిన అక్వా మందులను గుర్తించడం జరిగింది. అనంతరం సాయి రాం అక్వా షాపు యాజమాన్యానికి 75 వేల రూపాయిలు పెనాల్టీ వేయడం జరిగిందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘుబాబు, వరప్రసాద్, పుష్పరాజ్, తేజస్వని, వెంకటరమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి సందర్భంగా అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వ్యవస్థాపకులు మునికృష్ణారెడ్డి సారధ్యంలో నిరుపేదలకు, ప్రజలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీపతి, కళ్యాణ్‌కుమార్, మాజీ పాలకమండలి సభ్యులు బాలాజీ, రమణ, ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు ఇర్లరాజ, మనోహర్, యతీష్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారెడ్డి కాలనీ రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త



తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీ నుంచి టిటిడి అటవీ శాఖ కార్యాలయం మీదుగా హరే రామ హరే కృష్ణ మార్గంను కలుపుతూ ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్, టిటిడి అధికారులతో కలిసి పరిశీలించి త్వరితగతిన పనులు చేపట్టాలని అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. డిఎఫ్ఓ ఆఫీసు కాంపౌండ్‌ను తొలగించి పనులు ప్రారంభించి వెంటనే డిఎఫ్ఓ ఆఫీసుకు కొత్త కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రోడ్డు పూర్తి అయితే చాలా ప్రాంతాలకు రహదారి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆమెతో పాటు సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## అర్హులైన వారందరికీ ఫించన్లు పంపిణీ..పవిత్రారెడ్డి

-జగనన్న నాలుగేళ్ళ పాలనలో సర్వతోముఖాభివృద్ధి

తొట్టంబేడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల ఇన్‌చార్జి ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపుపవిత్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఫించన్లు పంపిణీని ఆమె ప్రారంభించారు. సమావేశానికి ఎంపిపి ఉన్నంనిర్మల వాసుదేవనాయుడు, వైకాపా సీనియర్ నాయకులు, కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు, వైస్ ఎంపిపి కన్నలిమల్లిక, కో ఆప్షన్ సభ్యులు కెజె.ప్రేమ్‌కుమార్, నాయకుడు కొన్నలిరమేష్, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నం, ఇఒపిఆర్‌డి తరుణాక్షరెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ హయాంలో ఫించన్లు పంపిణీ చేయాలంటే ఒకరు మృతిచెందితే మరొకరికి ఇచ్చేవారని అదికూడా వారి పార్టీ హయాంలో ఇచ్చేవారన్నారు. కానీ నేడు జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ ఫించన్లు పంపిణీచేస్తున్నామన్నారు. జనవరి నుంచి అవ్వాతాతలకు, వృద్దులకు, వితంతువులకు రూ.3వేలు ఫించన్లు అందుతాయన్నారు. మండలంలో 155మందికి కొత్తగా ఫించన్లు మంజూరైనాయని వారికి పంపిణ చేస్తున్నామన్నారు. తాటిపర్తి, మల్లిగుంట చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీటిని అందించేందుకు చర్యలుతీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పవిత్రారెడ్డితో పాటు మాజీ సర్పంచ్ మునిరత్నం, నాయకులు భాస్కర్‌రెడ్డి, యువత నాయకులు వెంకీ, మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఫించనులబ్దిదారులు, సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్‌లు హాజరయ్యారు.

## పనులు జరుగుతున్నపుడు పర్యవేక్షణ లేకుంటే ఎలా?

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టే పనుల వద్ద ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ లేకుంటే ఎలా? అని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అసహనం వ్యక్తం చేసారు. గురువారం ఆయన లోబావి వద్ద జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. అక్కడ కకేవలం ఇఇ మాత్రమే ఉండటంతో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎఇఇ,డిఇఇ,డ్రాఫ్ట్‌మెన్‌లు లేకపోవటంతో చైర్మెన్ అగ్రహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి లోబావిలో భరద్వాజసదన్ నుంచి గంగాసదన్ వరకు కు రూ.1.36కోట్లతో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు.రోడ్డు నిర్మాణంతో పాటు పక్కన మురుగునీటి, వరదనీరు ప్రవహించుటకు కాలువ నిర్మాణాలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా చైర్మెన్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.పనుల్లో నాణ్యతలో రాజీ పడవద్దని చైర్మెన్ ఇఇ నూకారత్నంకు సూచించారు. పనుల్లో నాణ్యత కొరవడితే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించరాదని సూచించారు.

## సమస్యలు మొరబెట్టుకుంటే కండువా వేయటమే బలమా?

ప్రాణాలర్పించి అయినా చక్కెర ఫ్యాక్టరీని కాపాడుతామన్నారు?

బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త

'మేము సమస్యలో ఉన్నాము? పరిష్కరించండి మహోప్రభో అంటూ శరణ జొచ్చి వస్తే పార్టీ కండువా వేసుకుంటేనే అంటూ బలవంతంగా పార్టీలో చేర్చుకోవటమే పార్టీ బలమా? అని తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి విమర్శించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ అలజడికి సంబంధించి గురువారం ఊరందూరులోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఓ విలేకరి 'మీ పార్టీ ఖాళీ' అవుతుందని ప్రశ్నించగా సమాధానం చెబుతూ నేడు వైకాపా పార్టీలో చేరిన తెలుగుదేశం తమ్ముళ్ళు అందరూ ఏదో సమస్యతో వెళితే పార్టీ కండువా కప్పుకోవాలని బలవంతం చేయటం పార్టీ బలమా? అని ప్రశ్నించారు.నేడు వత్తిడితో ఆ పార్టీ కండువా కప్పుకున్న వారు మా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి వస్తారని సమాధానం చెప్పారు.

**చక్కెర ఫ్యాక్టరీని కాపాడుతామన్నారు!**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చక్కెర ఫ్యాక్టరిని కాపాడుతామని నాడు జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో రైతులకు ముద్దులు పెట్టిన ఆయన నేడు ఆ ఫ్యాక్టరీని ఆయన అనుచరులు మంత్రులు ఎంఎల్ఏలు కొనుగోలు చేయటానికి వాటాలు పంచుకుంటుంటే ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాదయాత్రలో ముద్దులు పెట్టి తలనిమిరి నేడు గుద్దులు గుద్దుతున్నారని విమర్శించారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించి ఆ ఫ్యాక్టరీకి సంబంధించిన రూ.,కోట్ల స్థలాన్ని జిల్లాలో ఉన్న ఆయన అనుచరులు చేజిక్కించుకొనుటకు స్కెచ్ వేసారని అయితే వారి ఆటలు సాగనివ్వమని సుధీర్‌రెడ్డి స్పష్టం చేసారు.ప్రాణాలర్పించటానికి కూడా సిద్దమన్నారు.

**భూబకాసురులుగా మారారు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎక్కడ ఆవగింజంత స్థలం ఖాళీ కనబడితే వేసేయ్ పాగా అన్నట్లు శాసనసభ్యుడు మారారన్నారు.ఏర్పేడు,తొట్టంబేడుమండలాల్లోనూ, రాజీవ్‌నగర్‌లో, రామచంద్రాపురంలో భూముల్లో పాగా వేసి ప్లాట్లువేసి అమ్మేస్తున్నారని వాటిని కొంటే నిరుపేదలునష్టపోతారని సుధీర్‌రెడ్డి సూచించారు.తాము అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వెలికి తీస్తామన్నారు.

## నల్లగంగమ్మ అమ్మవారికి రూ.2.50లక్షల విరాళం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



పట్టణంలోని బహదూరుపేట తెట్టు వద్ద వెలసిన శ్రీనల్లగంగమ్మ అమ్మవారి వెండికవచానికి ఏర్పేడు వాస్తవ్యులు తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నైనారు పొన్నారావు పుట్టినరోజును పురస్కరించుకుని వారి కుమారులు బాలాజీ, డాక్టర్ పృద్వీ వారి దంపతులు అమ్మవారి వెండి కిరీటానికి గురువారం రూ.2.50లక్షలు విరాళాన్ని ఆలయ చైర్మన్ కంఠా రమేష్‌కు అందించారు. ఈసందర్భంగా దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంఠా రమేష్‌తో పాటు సభ్యులు కృష్ణమూర్తి,ర దిలీప్, యాదగిరి, అర్చకులు గుణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సారధి తీరు అనైతికం

-కాసరం రమేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త

ఉన్నన్ని రోజులు అటు తెలుగుదేశం పార్టీని ఇటు బొజ్జలకుటుంబాన్ని అన్ని విధాలుగా వాడుకుని తన స్వార్థపూరితమైన రాజకీయ అవసరాల కోసం బొజ్జలకుటుంబంపై నీతి మాలిన వ్యాఖ్యలు చేస్తున్న పార్థసారధి తీరు అనైతికం అని తెలుగుదేశంపార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు కాసరం రమేష్ ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరంలో జరిగిన పురపాలక సంఘం సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరపున కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలవడం ద్వారా సారధి బొజ్జల కుటుంబాన్ని మచ్చిక చేసుకుని వారి కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా చెప్పుకుంటూ తన రాజకీయ ఎదుగుదలకు అడ్డురాకూడదని అప్పటికే ఉన్న ఎంతో మంది కార్యకర్తలను నిర్ధాక్ష్యణ్యంగా అణచివేసిన ఘనుడు సారధి అని రమేష్ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. దివంగత నేత స్వర్గీయ బొజ్జలగోపాలకృష్ణారెడ్డికి అత్యంత విశ్వసనీయ వ్యక్తిగా నటిస్తూ చిన్నతనంలోనే పట్టణ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్, ఛైర్మన్ మరయు ప్రాంతీయ వైద్యశాలలలో సలహా కమిటీ ఛైర్మన్ తదితర పదువులను అనుభవించడానికి తెలుగుదేశంపార్టీ కారణం కాదని సారధి చెప్పగలడా అని రమేష్ ప్రశ్నించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అమలు చేయదలచిన మాస్టర్ ప్లాన్‌కు అవసరమైన స్థలాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు సమ్మతిస్తూ తమ ఆస్తులను దేవస్థానానికి అప్పగించడానికి ముందుకు వచ్చిన స్థానికులలో ఎక్కువ భాగం పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారేగనని రమేష్ గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా సారధి కుటుంబీకులు నిర్మించుకున్న ఆస్తులను కాపాడుకోవడానికి మాత్రమే వైకాపా పార్టీలో చేరాడని విమర్శించారు.

## పాదయాత్ర పూర్తయిన సందర్బంగా సంబరాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త

ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మరియు ఏపిసిసి కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు పాదయాత్ర చేసి ఏడాది పూర్తయని సందర్భంగా జోడోయాత్రలో రాహుల్ గాంధీ ప్రజలతో మమేకమవుతూ వారి సాధక బాధలను తెలుసుకుంటూ జోడోయాత్రను పూర్తి చేశారన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.బత్తెయ్యానాయుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి శివ సర్కిల్ నుంచి జోడోయాత్రను గుర్తు చేసుకుంటూ అంబేద్కర్ విగ్రహం వరకు జోడోయాత్రను నిర్వహించారు. కార్యాక్రమంలో జానీబాషా, విజయ్‌శేఖర్, నాగూరయ్య, గోపి, సురేష్, వానమ్మ, భానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శనవర్మ రాజు మృతికి భానుప్రకాష్ నివాళి



వడమాలపేట, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:

మండలంలోని ఎస్‌బీఆర్ పురం మాజీ సర్పంచ్, పారిశ్రామిక వేత్త, సీనియర్ రాజకీయ నాయకుడు గుంటుమడుగు సుదర్శన వర్మ మృతికి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ గురువారం భౌతిక కాయం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సురేష్‌రాజు, వైసీపీ నాయకులు పి.సి.చంద్రరాజు, తులసిరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, అబ్బరాజు, పెద్దబ్బరాజు, సర్పంచ్ మణిరాజు తదితరులు నివాళులర్పిం చారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:



అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం సందర్భంగా కామరాజు నగర్ బలిజ స్ట్రీట్ కొండ్లపుత్తూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పోషణ వేడుక కార్యక్రమానికి సీడీపీవో పద్మజ పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్న పిల్లలు కుటుంబంలోని సభ్యులందరూ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన పోషకాహారం గురించి ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాల ఆవశ్యకత వాటిలో ఉండే పోషక విలువల గురించి ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వండే విధానం ఏ పాత్రల్లో వండాలి, ఈప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ ఆహారం ఉండడం వలన మండడం వలన కలిగే దుష్పరితాలు వివరించి అందరూ కూడా మంచి పోషక విలువలు ఉండే ఆహారం ప్రతిరోజు తీసుకోవడం ద్వారా వారి ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్ర లబ్ధిదారులు చిరు ధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను వాటి తయారీ విధానం గురించి అందరికి అర్థమయ్యే విధంగా తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు అంబికా, ఈశ్వరి, దుర్గ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ మందిరంలో విశేష పూజలు చేసిన గాలి భానుప్రకాష్

పుత్తూరురూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపల్ పరిధిలోని పిళ్లారిపట్టు గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆలయంలో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దాసరి మఠంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రాయలచెరువు రోడ్డులోని కంభత్ ఆళ్వార్ మఠం(దాసరిమఠం) ఆవరణలోని శ్రీకృష్ణ ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఉదయం స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి,స్వామి వారిని పట్టు వస్త్రాలు,బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు.అనంతరం పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో దాసరిమఠం గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ నిబంధనల మేరకు వ్యాపారాలు నిర్వహించుకోవాలి

-హోటల్ నిర్వాహకులు,దుకాణదారులకు డిపిటిఓ సూచన

తిరుపతి(రవాణా) సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్ ఆవరణలోని టాయిలెట్స్, దాకాణదారులు,హోటల్ నిర్వాహకులు ఆర్టీసీ నిబంధనల మేరకు తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి సూచించారు. గురువారం ఈ మేరకు స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో దుకాణదారులు,హోటల్,టాయిలెట్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిపిటిఓ మాట్లాడుతూ ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని,బస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఎంఆర్‌పి రేట్లకే వస్తువులు విక్రయించాలని,సకాలంలో అద్దెలు చెల్లించాలని అన్నారు. ప్రయాణీకుల నుండి ఏవేని ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చినట్లయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్,బస్‌స్టేషన్ అసిస్టెంట్‌ట్రాఫిక్‌మేనేజర్‌డి.రామచంద్రనాయుడు,పర్సనల్‌ఆఫీసర్‌ఎం.పార్థసారథి,పాల్గొన్నా రు.

## 11 నుంచి 67వ స్కూల్ గేమ్స్ ప్రారంభం

నగరి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:

ఈ నెల 11వ తేదీ నుంచి 67వ స్కూల్‌గేమ్స్ నిర్వహిస్తున్నట్టు డీఈవో విజయేంద్రరావు, చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌గేమ్స్‌లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 11వ తేదీ నుంచి 17 వరకు మండల స్థాయి, సెప్టెంబరు 18వ తేదీ నుంచి 26 తేదీ వరకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడలకు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. ఒక విద్యార్థి వివిధ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు.

## భజన మండలి స్థాయి పెరగాలి

- సత్యసాయిసేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

నగరి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:

సత్యసాయి భజన మండలి స్థాయి పెరగాలని శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని తడుకుపేట, శ్రీ సాయి శివాలయంలో గోపూజ, అష్టోత్తర పూజలు, భజన నిర్వహించి మహా మంగళ హారతి అనంతరం 504 మంది భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం నిర్వహించిన సత్యసాయి భజన మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయి భజన మండల స్థాయి నుంచి సమితి స్థాయికి ఎదగాలని స్వామిని ప్రార్థిస్తున్నానన్నారు. బాల వికాస్ తరగతులు నిర్వహించి భజన మండలికి పూర్వ వైభవం తీసుకుని రావాలన్నారు. మొక్కలు నాటుటపై సభ్యులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ నెలలోనే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, మండల స్థాయి వ్యాసరచన పోటీలను ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ, ఇంజనీర్ విద్యార్థులకు విడి విడిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లిఖిత నామ జప పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పదాతికారులు, యూత్ సాయిచేతన్, రమేస్, నవీన, తడుకుపేట కన్వీనర్, ఓ.వెంకటరమణ, సభ్యులు నాగేశ్వర్, నెహ్రూ బాబు, లవకుమార్, లీలారాం, బాల వికాస్ గురువు శ్రీదేవి, బాల వికాస్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త :

మండలంలోని ఇష్టకామేశపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య గురువారం నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, క్రయాన్స్ తదితర విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ వంతు సాయం అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉదయ, నాయకులు పాండయ్య, భరత్, రేఖ, జిల్ దాసు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త :



మండలంలోని చెంగమనాయుడు కండ్రిగలో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పిల్లలను శ్రీకృష్ణుని వేషధారణతో ఊరేగించారు. మధ్యాహ్నం స్థానిక శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించి, పిల్లలతో కోలాటం ఆడించారు. సాయంత్రం గ్రామంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## షాకిరాలీని పరామర్శించిన సుధీర్‌రెడ్డి

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ మైనార్టీ నాయకుడు షాకిరాలీ గుండెపోటుకు గురై తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిసి స్విమ్స్ ఆస్పత్రికి వెళ్ళి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్యంగా ఉండకుండా ధైర్యంగా ఉండాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సుధీర్‌రెడ్డితో పాటు మైనార్టీ నాయకులు అస్మత్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేనిచెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నెట్టేరి ఉప సర్పంచ్ మోహన్‌బాబుకి సన్మానం

నింద్ర, సెప్టెంబరు 7 ప్రభాతవార్త

నెట్టేరి ఉప సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికాబడిన,టిడిపి నాయకులు మోహన్‌బాబును నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీ గాలి భానుప్రకాష్ ఘనంగా సన్మానించినారు.సోమవారం నెట్టేరి గ్రామపంచాయితీలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలలో టిడిపి అభ్యర్థి మోహన్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు బాబుయాదవ్,నాయకులు వెంకటరత్నంనాయుడు, క్రిష్ణయ్య, రమేష్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నా మట్టి... నా దేశం... ప్రారంభం

రేణిగుంట, సెప్టెంబరు7 ప్రభాతవార్త:



దేశ రాజధాని ఢిల్లీ నగరంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల సంస్కరణార్థం నిర్మిస్తున్న అమృత వాటిక కోసం బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నేతలు రేణిగుంట పట్టణం జీఎం వీధి నుంచి బుధవారం మట్టి సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రధాన మంత్రి మోదీ ఆశయ సాధనలో భాగంగా పార్టీజాతీయ అధ్యక్షుడు జేపి నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేవ్వరి ఆదేశాల మేరకు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్‌సూచనలతో మట్టి సేకరణ ప్రారంభించామని జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బీడీ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలోజిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డీడీ బాలాజీ, సుబ్రహ్మణ్యం, సిద్ధలయ్య, శ్యామ్‌చంద్, మహిళా మోర్చా జిల్లా సభ్యురాలు అన్నపూర్ణ, బీజేపీ నేతలు పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, చింతంశెట్టి, రాజా రాయల్, పల్లం చెంగల్రాయుడు, ఎం.ప్రభాకర్, షేక్ మహ్మద్, వేణుగోపాల్, కొండా కిషోర్,ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డిని గెలిపించండి - తెలుగుదేశాన్ని ఆదరించండి

రేణిగుంట, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:



బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి తెలుగుదేశాన్ని ఆదరించాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం, నీలిసానిపేట ప్రాంతల్లో మీ ఆశీర్వాదం కోసం మీ ఇంటికి మీ బొజ్జల కార్యక్రమంలోభాగంగా రిషితారెడ్డి టీడీపీ నాయకులతోకలసి బుధవారం ఇంటింటికి తిరిగారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, జిల్లా టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్‌నేతలు పుష్పనాథం, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, మురళి, గజేంద్ర, ఎస్సీ నాయకులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం

తిరుపతి (మహిళాయునివర్సిటీ), సెప్టెంబర్ 7, ప్రభాతవార్త



ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం ఆత్మహత్య నివారణ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ శాఖల నుండి సుమారు 100కు పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. చివరగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థులకు అందజేసారు. ఈ కార్యక్రమానికి ఎద్యుకేషన్ విభాగానికి చెందిన డాక్టర్ బేబి ప్రసన్న, డాక్టర్‌మాధవి, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్. రజనీ, సైకాలజీ విభాగం అధినేత డాక్టర్ ఎ. గాయత్రి పాల్గొన్నారు.

## మనోహర్‌నాయుడుకి రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు

నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



నారాయణవనం మండలం అరణ్యకండ్రిగ పంచాయతీ అరణ్యంకండ్రిగ గ్రామానికి చెందిన ఎన్ మనోహర్‌నాయుడుకి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్త పరిచారు. ప్రస్తుతం పాలసముద్రం మండలంలోని ఎస్ఆర్ కండ్రిగ హైస్కూల్ ప్లస్‌లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయన సుమారు 34 ఏళ్ల పాటు విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ నిరంతరం విద్యార్థుల అభివృద్ధి కొరకు కృషి చేస్తూ, తన జీవితం విద్యార్థుల సేవకు అంకితం అనే విధంగా పని చేస్తూ, విద్యార్థులను ఎన్నో పోటీ పరీక్షలకు సంసిద్దులుగా చేస్తూ (ఎన్ఎంఎంఎస్, ఇన్‌స్పైర్, ఐఐఐటి, ఎపిఆర్‌జెసి) పాఠశాలలో జాతీయ పండుగలు, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ , గాంధీజీ, అంబేద్కర్‌ల అభ్యుదయ నాయకుల స్ఫూర్తిగా, ఖాళీ సమయాల్లో మానసిక వికలాంగుల జీవితంలో మార్పులె తెచ్చిన వ్యక్తి మనోహర్‌నాయుడు. ఆయన విద్యారంగంలో పని చేస్తూ ఎన్నో సేవలను అందించడం వల్ల ఇప్పటికే ఆయనికి మండల, క్లస్టర్, జిల్లా స్థాయిలో అనేక అవార్డులను పొందారు. ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుతో నాలో సేవా గుణాన్ని మరింత పెంచిందన్నారు.

## అంగన్‌వాడీలో ఆయా పోస్టులకు ధరఖాస్తు చేసుకోండి

నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలో ఖాళీగా వున్న పోస్టులకు ఈనెల 11వ తేది లోపు ధరఖాస్తూ చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బేబి తెలిపారు. మండలంలోని దిగువకనకపాలెంలో హెల్పర్ పోస్టుకు ఎస్సీ కులస్తులు, ఎరికంబట్టులో హెల్పర్ పోస్టుకు బిసి-ఎ కులస్తులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికులై వుండి పదవతరగతి ఉత్తర్ణీత, 21నుంచి35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

## 9నుండి శ్రీకృష్ణదేవరాయ

జాతీయ సంగీత సాహిత్య నృత్యకళోత్సవాలు

తిరుపతి,సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:



రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో 33వ కృష్ణదేవరాయ జాతీయ సంగీత,సాహిత్య,నృత్యకళోత్సవా లను ఈనెల 9వతేదీ నుండి 11వరకు నిర్వహిస్తున్నట్లు రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. మూడురోజులు మహతి కళాక్షేత్రంలో ఈ కళోత్సవాలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించి గోడపత్రికల,కరపత్రాలను గురువారం ఉదయం రంగస్థలి కార్యాలయంలో రంగస్థలి వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కెవెన్ రాజా, కళాకారులు వెంకటేశ్, సుబ్రమణ్యంరెడ్డి ,కేశవులురెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. కళలను ప్రోత్సహించడంలో భాగంగా కళాకారులను అన్ని విధాలా ఆదుకునేందుకు రాయలసీమ రంగస్థలి ఈ కళోత్సవాలునిర్వహిస్తున్నట్లుతెలిపారు.తిరుపతిప్రజలుపాల్గొని కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

## ఆధ్యాత్మిక చింతనలో ఆమె ఆదర్శం

అమ్మవారి ఆలయ పాలక మండలి సభ్యురాలు ఉషకు నివాళి

శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక చింతనలో ఆమె మనందరికీ ఆదర్శమని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేటకు చెందిన డాక్యుమెంట్ రైటర్, మాజీ ఎంపిటిసి సి.ఎం.కేశవులు (బుజ్జి) సతీమణి సి.ఉష గత నెల 27న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె అకాల మరణం తీవ్ర వేదనకు గురిచేసిందన్నారు. దైవం పట్ల భక్తి, క్రమశిక్షణ, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన ఉష మనందరినీ విడిచివెళ్ళిపోవడం భాధాకరమన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి లభించాలనీ, వారి కుటుంబ సభ్యులకు అమ్మవారు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు.

## విద్యార్ధులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి..!

ప్రధానోపాధ్యాయురాలు తులసికుమారి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యశించే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నెత్తకుప్పం జడ్పీ హై స్కూల్ హెచ్‌ఎం తులసికుమారి అన్నారు. ఇక్కడ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్ళిన ప్రధానోపాధ్యాయుడు కె.సురేష్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, సెల్వరాజ్, తదితరులకు గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో సురేష్ సేవలు ఎనలేనివని కొనియాడారు. ఉపాధ్యాయులు కష్టపడి పనిచేసి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడి సుబ్రమణ్యం రెడ్డి, ఉపాధ్యాయులు లలిత, రెడ్డెమ్మ, శ్రీనివాసులు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను అలరించిన కీచక వధ

రామచంద్రాపురం, సెప్టె ంబర్ 7 ప్రభాతవార్త:

మహాభారత ఉత్సవాలలో భాగంగా గురువారం కీచకవధ హరికథ ప్రేక్షకులను అలరింపజేసింది. మండలంలోని ఎన్.ఆర్.కమ్మపల్లి లో మహాభారత ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పాండవులు మారువేషంలో విరాటరాజు కొలువులో చేరడం, ద్రౌపదిదేవి విరాటరాజు భార్య సుధేష్ణదేవి వద్ద సైరేంద్రిగా చేరే కథను భాగవతారిణి సీతాలక్ష్మి రాగయుక్తంగా ఆలపించారు. సుధేష్ణదేవి తమ్ముడు కీచకుడు ద్రౌపధీ మాతను చెరపట్టడం, వంటింట్లో కీచకుడిని భీమసేనుడు హతమార్చడం వంటి ఘట్టాలను ప్రేక్షకులకు చక్కగావివరించారు.

# లోపాలు లేని ఓటర్ల జాబితా లక్ష్యంగా చర్యలు చేపట్టండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : పారదర్శకమైన లోపాలు లేని ఓటర్ల జాబితా లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్ 2024 పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎనిమిదవ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారు లక్ష్యంగా అందరూ సహకరించాలన్నారు. క్లైమ్స్ అందిన వాటికి తొలగిం పుల విషయంలో నోటీసులు ఇచ్చి నిర్ధారణ అనంతరం రికార్డు ఫైల్ చేసి అనంతరం ఇఆర్ఓ తొలగింపులు చేపట్టనున్నారని అన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత ఎస్ఎస్ఆర్ నుండి నేటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాలోపరిశీలన చేపట్టడం జరిగిందనీ, ప్రతి బిఎల్ఓ రిజిస్టర్ నిర్వహించాలని పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, సహకరించాలని సూచించారు. ఇంటింటి ఓటర్ల వెరిఫికేషన్ నేటి వరకు రిపోర్టు మేరకు జిల్లాలో 28 ఆగస్టు 2023 నాటికి 1732448 ఓటర్లు నమోదు కాగా నేటి వరకు ఓటర్ల వెరిఫికేషన్ 99.70 శాతం పూర్తయిందని తెలిపారు. సెప్టెంబర్ 6 నాటికి 6,7,8 ఫారంలకు సంబంధించి చాలా మేరకు వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. 9,10,11ఎ,బి ఫారాలు అన్ని రాజకీయ పార్టీ నాయకులకు హార్డ్ కాపీలను, వారి మెయిల్‌కు సాఫ్ట్ కాపీని పంపించాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి ప్రతినిధిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు అసలైన ఓటర్లు కాకుండా బోగస్ ఓటర్లు ఉన్నారనిపిస్తే పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షలో రాజకీయ పార్టీ ప్రతినిధులు టిడిపి నుండి పులివర్తి సుధ, మనోహరాచారి, బిజెపి నుండి వరప్రసాద్ ఇండియన్ కాంగ్రెస్ నుండి రవి, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సురేష్, ఏఈఆర్ఓలు శిరీషా, వెంకటరమణ, ఎన్నికల తహశీల్దార్ సురేష్, డిటిలు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక రంగంలో మార్పులు అవసరం


సెమినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

ఏర్పేడు,(శ్రీకాళహస్తి రూరల్) సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక రంగంలో మార్పులు ఎంతో అవసరమని గురువారం జరిగిన సెమినార్‌లో వక్తలు వివరించారు. మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సెమినార్‌లో పలువురు వక్తలు,పరిశ్రమల మారుతున్న కాలానుగుణంగా అవగాహన కల్గి ఉండాలన్నారు. రెండవ రోజు సెమినార్‌లో ఎన్నో కొత్త విషయాలను వెలికి తెచ్చారు. ఏర్పేడు లోని తిరుపతి ఐఐటిలో 29వ అంతర్జాతీయ ఫ్యాబ్రికేషన్స్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అనే అంశంపై మూడు సమావేశాలను నిర్వహిస్తున్నారు. దేశ విదేశాల నుంచి 15 ప్రముఖ కంపెనీలు సారధ్యంలో ముఖాముఖి చర్చలు సమావేశాల్లో పాల్గొన్నారు. జాతీయ సమావేశాలకు సత్యానారాయణ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డిఆర్‌డిఓ ఎపివిఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు 30 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 15 ఐఐటిలు, ఎన్ఐటిలు, ఇస్రో, డిఆర్‌డిఓలాప్స్ తదితర ప్రముఖ కంపెనీల ఇంజనీర్లు పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యుని చెంతకు చేర్చటమే లక్ష్యంగా తిరుపతి ఐఐటి పని చేస్తుందని డైరెక్టర్ ప్రొఫెసర్ కేయన్ సత్యనారాయణ అన్నారు. ప్రస్తుతం మెకానిక్ విభాగంలో మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా కంపెనీలు,ప్రభుత్వ రంగ సంస్థలు వివిధ ఉత్పత్తులు టెక్నాలజీని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని కళాత్మకతను బహిర్గతం చేస్తుంది. కార్యక్రమాల్లో ఐఐటికి చెందిన రవిశంకర్, కామాక్షి మదిలి, శ్రీవాస్తవ ఆర్కెరామ్ తదితరులు పాల్గొన్నారు.

## గోకులాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్7 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో టిటిడికి చెందిన శ్రీవేంకటేశ్వర గో సంరక్షణశాలలో గురువారం జరిగిన గోకులాష్టమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోశాలలోని గోవులకు జరిపిన పూజా కార్యక్రమం లో పాల్గొని గో మాతకు ప్రసాదం అందించారు, అనంతరం గోశాలలోని వేణుగోపాలస్వామిని ఎమ్మెల్యే చెవిరెడ్డి దర్శించుకున్నారు. ప్రతి ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన గోశాలలో నిర్వహించే వేడుకలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హాజరై, గోపూజ చేయడం అనవాయితీ. ఈ క్రమంలో ఎమ్మెల్యే గోశాలకు చేరుకోగానే డైరెక్టర్ డాక్టర్ హరినాథరెడ్డితో పాటు ఇతర టిటిడి అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గోపూజ, స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేసారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రజలు అందరికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. దేవదేవుడైన శ్రీనివాసుని దశావతారాల్లో ఒక్కటైన శ్రీకృష్టుని చల్లనిచూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## ఎస్వీయూ ఆచార్యులను అభినందించిన విసి



తిరుపతి (క్రిడ), సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఎస్వీయూ ఆచార్యులను విసి ఆచార్య కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్‌లు అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిలో ఆచార్య శ్రీమురళి, ఆచార్య దామోదర్‌రెడ్డి, డా.మంజుల, ఆచార్య నరసయ్య, ఆచార్య పద్మావతి, ఆచార్య శరత్ బాబులు ఉన్నారు.

## చిన్నేపల్లి హెచ్‌ఎంకు జాతీయ ఉత్తమఅవార్డు



పెద్దపంజాణి సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని చిన్నేపల్లి జెడ్పీ హైస్కూల్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారెళ్ళ భాస్కర్ గురుదేవోభవ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ను అందుకున్నారు. గురువారం పాఠశాలలో మారెళ్ళ భాస్కర్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మహ్మద్‌అలీ మాట్లాడుతూ మారెళ్ళ భాస్కర్ ప్రైమరి స్కూల్ ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయ వృత్తిలో వచ్చారని పిల్లల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయన చేసిన సేవలు గుర్తించి తిరుపతి వేపౌండేషన్ వారు గురుదేవో భవ జాతీయఅవార్డును అందించడం అర్హనీయమన్నారు. హెచ్‌ఎం మారెళ్ళ భాస్కర్ మాట్లాడుతూ తాను పేదరికంనుంచి పైకివచ్చానని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలదిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇక్బాల్ భాషా, అంజాద్ భాషా, రషీద్ అహ్మద్, బావాజాన్, అబ్దుల్ లతీఫ్, భవాని, శమాసుల్తానా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామీ రాజకీయ స్వార్థం వీడి... ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయండి

**- జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అకేపాటి సుభాషిణి**



వెదురుకుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : రాజకీయ స్వార్థం వీడి ... ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయడంకు డిప్యూటీ సీఎం నారా యణస్వామి కళ్ళు తెరచి పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అకేపాటి సుభాషిణి చూచించారు. మండల కేంద్రంలో గత మూడు రోజులుగా వెదురు కుప్పం, కార్వేటినగరం మండ లాలను తిరుపతి జిల్లాలో చేర్చాలని చూస్తున్న ఆమరణ నిరహాదీక్షకు మద్దతుగా యుగంధర్ పొన్నాకు పూలమాలవేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాలను కలిపే సామర్థం లేని డిప్యూటీ సీఎం హోద ఎందుకని తీవ్ర స్థాయిలో ధ్వజమైత్తారు. పిల్ల రోజా, పెద్దిరెడ్డి చూపిన చొరవ మీరు చేయలేక పోతున్నరంటే మీ అసమర్థత, నీ స్వార్థం ప్రజలు ప్రస్ఫూటంగా గమనిస్తున్నారని ఇప్పటికైన బుద్ది తెచ్చుకుని ప్రతి దానికి జగన్ రెడ్డి కాళ్ళు మొక్కే స్వాభావం ఉన్న నీవు, ఈ రెండు మండలాల కోసం వేయ్యె సార్లు కాళ్ళు పట్టుకోవడం మంచిదని హితువు పలికారు. రాయలసీమ రీజనల్ సమన్వమకర్త ఆకుల వనజ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తుకంటే నీ కుటుంబ భవిత ముఖ్యమా స్వామీనీకు అని ఉప ముఖ్య మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోంపిచర్ల, పులిచర్ల మండలాలకు ఉన్న ప్రాధాన్యత వెదురుకుప్పం, కార్వేటినగరంలకు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం పార్టీ అధ్యక్షులు పురుషోత్తం, నాయకులు యతీశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హనుమంత రెడ్డి, యువజన అధ్యక్షులు సతీస్, బిజెపి జిల్లా కార్యదర్శి లక్ష్మీ, తిరుపతి టౌన్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, తిరుపతి నియోజకవర్గ వీర మహిళలు లావణ్య, దుర్గా, చందన, సంయుక్త కార్యదర్శి రాఘవలు పాల్గొన్నారు.

## నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగస్వాములు కండి : నిషిధరాజు



పుత్తూరురూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు గౌరవ ప్రధాన మంత్రి మోదీ సంకల్పించిన కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపు మేరకు నగరి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నా భూమి-నా దేశం కార్యక్రమం రాయలసీమ ఇన్‌చార్జి ఎం.నిషిధరాజు నిర్వహించారు. నగరి నియోజకవర్గంలో నిషిధరాజు ఆధ్వర్యంలో పుత్తూరు మండలం రాజులకండ్రిగలోశ్రీకృష్ణ దేవాలయంలో పూజలు చేసి తిరుమలకుప్పం, అడవి కండ్రిగ, నా భూమి-నా దేశం ప్రతి ఇంటి ముందు చిటికి మట్టిని సేకరించి మొదలు పెట్టారు. అందరం కలసి అందరం కోసంపని చేయాలనే భావనతో, అమృత్యోత్స వాల్లో భాగంగా ప్రధాని మోదీ ఆలోచనతో ఈ 15 రోజులు పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి ఒక చిటిక మట్టిని సేకరించి ఢిల్లీకి చేర్చడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చినటువంటి మట్టిని వినియోగించి అమృత వనం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు మండలం అధ్యక్షుడు ఇ.శ్రీధర్, చిత్తూరు జిల్లా కార్యదర్శి లక్ష్మీవర్మ, ఎంపీటీసీ రాజేంద్ర రాజు, యువ మోర్చా అధ్యక్షుడు కిషోర్, నగరి సోషల్ మీడియా కన్వీనర్ వేణు, మహిళా మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాలభైరవ స్వామికి పుష్పాలంకరణ సేవ

నగరి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని శ్రీ కామాక్షిసమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామికి గురువారం అష్టమి పూజల్లో భాగంగా పుష్పాలంకరణ చేశారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

## యుగంధర్ పొన్నా ఆరోగ్య పరిస్థితి పరీక్షించిన వైద్య సిబ్బంది

వెదురుకుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని గత మూడు రోజులుగా నిరహాదీక్ష చేస్తున్న నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్నా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం కొరకు పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు.

## శ్రీచెంగాళమ్మను దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి



సూళ్ళూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : సూళ్ళూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని రాష్ట్ర హైకోర్టు జడ్జి డివిఎస్ఎస్ సోమయాజులు గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయా నికి వచ్చిన హైకోర్టు జడ్జి దంపతులకు కార్య నిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, సూళ్ళూరుపేట జడ్జి ఎస్.అనూష తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి దేవస్థానంలో చండీయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దువ్వూరు అశోక్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం ప్రాంగణంలోని యాగమండపంలో గోమాతకు పూజలు చేసిన అనంతరం ప్రారంభమైన యాగం మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతితో ముగిసింది.

## గోవిందుడికి శ్రీకృష్ణాలంకారం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి స్వాములవారి దేవస్థానంలో కృష్ణ జయంతిని పురస్కరించుకొని స్వామివారికి కృష్ణాలంకారాన్ని గురువారం చేశారు. కృష్ణాలంకారంలో ఉన్న గోవిందుని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కచ్చేరివీధి సెంటర్‌లో స్వామివారికి శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరికోట బస్టాండు వద్ద యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు భక్తుల కోలాహలం మధ్య కన్నులపండువగా జరిగాయి.

## సాంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకలు



తడ, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : తమ మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పలు వైష్ణవ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని చిన్న మాంబట్టులో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. అక్కడ తిరుపతి అన్నమయ్యాచార్య ప్రాజెక్టు వారు భజనలు హరికథ కాలక్షేపం వంటి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన స్విమ్స్ వైద్యులు డాక్టర్ కారణి మునస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారు. మధ్యాహ్నం అన్నదానం చేసారు. ఉభయకర్తలుగా మోహన్ రావు, శేఖర్ రావు సోదరులు వ్యవహరించారు. చిన్నమాంబట్టు శివాలయం చైర్మన్ ముని శ్రీనివాసులు , అన్నదానం కమిటీ చైర్మన్ దేవేంద్ర రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నాయుడుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో ఉన్న రామాంజనేయస్వామి ఆలయం వద్ద స్థానిక యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే సంజీవయ్య శ్రీకృష్ణ మందిరానికి సాంప్రదాయ వస్త్రాలను సమర్పించారు. మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తవణంపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు బుధ, గురువారాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని జొన్న గురకల, అరగొండ, మత్యం, ఎం.గొల్లపల్లె, నల్లిశెట్టిపల్లె, నారసింహనపల్లె, దిగువమాఘం, వీర్లగుడి పల్లె, తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. అలాగే రాత్రి తనకిష్టమైన గరుడ వాహనంపై స్వామివారిని వుంచి మంగళవాయిద్యాలు, ప్రత్యేకబాణా సంచా పేలుళ్ళ నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అలాగే ప్రతి ఇంటిలోనూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణుని విగ్రహాలను, చిత్రపటాలను ఏర్పాటు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. దీనితో పాటు గోమాతను అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అలాగే చిన్నపిల్లలు శ్రీకృష్ణుడు, రాధాదేవి, సత్యభామ వేషదారణలతో ఇళ్ళలో మురిపించారు.

## ఆకట్టుకుంటున్న రాధాకృష్ణుల అక్రిలిక్ రంగుల చిత్రం



కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ పర్వదినం సందర్భంగా యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల ఆర్ట్‌మాస్టర్ కె.దామోదరాచారి అక్రిలిక్ రంగులతో శ్రీరాధా,కృష్ణుల చిత్రాన్ని రూపొందించారు. ఈచిత్రం ఎంతో ఆకట్టుకుంటోంది.

## చక్కెర కర్మాగారం కార్మికులకు బకాయిల పంపిణీ



రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: సుదర్ఘీకాలంగా ఎదురు చూస్తున్న శ్రీ వెంకటేశ్వర సహకార చక్కెర కర్మాగారం కార్మికులకు జీత బకాయిలను గాజులమండ్యం కర్మాగారప్రాంగణంలో పంపిణీ చేశారు. కార్మికుల కళల్లో ఆనంద భాష్పాలు జలజల రాలాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం విశిష్ట అతిథులుగా పాల్గొన్న సమావేశంలో జీత బకాయిల చెక్కుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జగనన్నకు థ్యాంక్స్ అంటూ జరిగింది. ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాజిక న్యాయం జగనన్న పాలనలోనే జరుగుతుందని, అసలు సిసలైన సంఘ సంస్కర్తగా జగన్‌ని అభివర్ణించారు. సమావేశంలో చక్కెర కర్మాగారం ఎండీహరిబాబు, ఎంపీపీ హరి ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, మండల సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షులు గాజులమండ్యం సర్పంచ్ డా॥గంగారి రమేష్, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, వెంకట రమణారెడ్డి, వైసీపీ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, మల్లం రవిచంద్రరెడ్డి, కార్మిక నాయకులు రైతు నాయకులు ఆదికేశవులు, సుధాకర్‌రెడ్డి, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా మైనారిటీ వైసీపీ అధ్యక్షులు మహ్మద్ రసూల్, వైసీపీ మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం, తూకివాకంసర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, తారక రామానగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం చంద్రవేఖర్‌రెడ్డి, షబీర్ అహ్మద్, మహిళా నాయకురాలు అరుణాదేవి, పెద్ద సంఖ్యలోకార్మికులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా అవనాక్షమ్మ అమ్మవారి జాతర



నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం అవనాక్షమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం రాత్రి నారాయణవనంలో అమ్మవారిని ట్రాక్టర్‌పై అమర్చి పుష్పపల్లకీలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అంతకుముందు అమ్మవారి ఆలయం అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం మొక్కుబడి కలిగిన భక్తులు శరీరానికి ముళ్లు గుచ్చుకొని లారీలు, ట్రాక్టర్, ఆటోలపై వ్రేలాడడం భక్తులను మరితంగా ఆకట్టుకుంది. నారాయణవనం వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, అర్చకులు పన్నీర్‌సెల్వం, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి, రోహిణీ నక్షత్రం సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, రవిచంద్రన్, అధ్యాపక ఘనాపాటి తిరువెంగడం స్వామి, పరిచారిక డాక్టర్ ఉదయ్ తేజ స్వామి, జమేదర్ బాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో కృష్ణాష్టమి సంబరాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం కృష్ణాష్టమి సంబరాలు మిన్ను ముట్టాయి. ఆలయానికి సంబంధించిన బిక్షాల గాలిగోపురం సమీపంలోని గోకులంలోనూ, లోబావి లోని గోశాలలో పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. బిక్షాల గాలిగోపురం సమీపంలో కొత్తగా సప్త గోకులంను ఏర్పాటు చేసారు. అలాగే ఆలయానికి అనుబంధంగా లోబావిలో గోశాలను నంద గోవులకు పూజలు నిర్వహించారు. కృష్ణుని విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. గోవులకు కర్పూర హారతులిచ్చి పూజలు జరిపారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, రామ్‌నాథన్ గురుకుల్, వేదపండితులు శివకుమార్ శర్మ, పరిచారకులు రాకేష్‌శర్మ, మహేష్, ఉపకార్యనిర్వహణాధికారులు ఎన్ ఆర్.కృష్ణారెడ్డి, జె.వెంకటసుబ్బయ్య, ఇఇ నూకారత్నం, గోశాల ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, ఆలయ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు ఆలయఅర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : ఈనెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మరియు రాజీ మార్గమే రాజమార్గం అని ఈ అవకాశం కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిశాఖలకు చెందిన అధికారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా కేసులు పరిష్కరించుకోవడానికి సహకరిస్తూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషిచేయాలని రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకుని కక్షిదారులకు తెలియజేయాలన్నారు.

## తీసుకున్న అప్పు ఇవ్వక పోవడంతో...ఆత్మహత్య యత్నం!



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: మాతమ్మతో పెళ్ళి చేసుకొని నమ్మించి రూ.పది లక్షలు తీసుకొని చెల్లించక పోవటంతో పోలీసు స్టేషన్ వద్దనే ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసులు వెంటనే ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించటంతో బతికి బయట పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కరుమారి యమ్మ ఆలయంలో పూజారిగా ఏడు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ప్రస్తుతం మాతమ్మగా ఉండగా ఓ వ్యక్తితో పరిచయమైందని వివరిం చారు. అతను రాహుల్‌గా వివరించారు. ఆతను బట్టలషాప్ పెట్టు కోవాలని మొరపెట్టుకోగా అక్కడ ఇక్కడ అప్పులు చేసి సుమారు రూ. 10లక్షలు ఇచ్చానని వివరించారు. ఆతను రూ.లక్ష తీర్చాడు, బట్టల షాపును కరోనా కాలంలో మూసివేసి తనను ముంచేసా డన్నారు. కరిమారియమ్మ ఆలయంలో రెండు సంవత్సరాల క్రితం అగ్నిగుండం సందర్భంగా తానుమాతమ్మవేషం వేయగా వివాహం చేసుకున్నట్లు సృష్టించాడ న్నారు. తాను పెళ్ళి చేసుకున్నట్లు సృష్టించి రాహుల్ ఆతని తల్లి మరో రూ.1.5లక్షలు తీసుకున్నారని వాహనం కొనుగోలు చేసారని తెలిపారు. ఉత్తుత్తి పెళ్ళి చేసుకున్న రాహుల్ ఆయన బంధువులు తల్లి నవనీత మేనమామ భార్య భావన కూడా పాల్గొని 16రోజుల కార్యక్రమాలు నిర్వహించారు. తాను మధ్యలో ఉండి పట్టమ్మ, సుబ్బయ్య, గౌసిని, కుమార్, కెవిబిపురం నుంచి విష్ణుల నుంచి అప్పులు చేసినాని వారు తనను మానసికంగా వేదిస్తున్నారని పత్రికల వారికి వివరించారు.

## కేబుల్ వైర్ చోరీ కేసులో నిందితులు అరెస్టు



చిల్లకూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి కేబుల్ వైర్ చోరీ కేసులో నిందితులు అరెస్టు కేసుకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడివేడు గ్రామంలో ఏర్పాటై వున్న కల్పతరువు లోగుల్ అల్యూమీనియం పరిశ్రమంలోకి ఆగస్టు 29వ తేది రాత్రి పరిశ్రమలోని తలుపులు తాళాలు పగలగొట్టి పరిశ్రమలోని ఉన్న 80 వేల మీటర్ల కాపర్ కేబుల్ వైర్‌ను గూడూరు మండలానికి చెందిన శారదానగర్ ఎస్టీ కాలనీకి చెందిన ఎందోటి కృష్ణ, అమలూరు శివమణి, నాగముంతల చెంచయ్య, అద్దూరు పుల్లయ్య అనే యువకులు మద్యానికి బానిసలై ఈ దొంగతనం చేయడం జరిగిందన్నారు. పరిశ్రమ యజమాన్యం ఫిర్యాదుతో సిఐ దశరధరామారావు, ఎస్ఐ బి. గోపాల్, సిబ్బందితో కలిసి లోతుగా విచారించడంతో పై తెలిపిన నలుగురు నిందితులను అదుపులో తీసుకుని విచారించగా 600 మీటర్ల కాపర్‌వైరు మాత్రమే రికవరీ చేయడం జరిగిందన్నారు. దొంగలించిన కాపర్‌వైరు విలువ 4,15,000 రూపాయిలు వుంటుందన్నారు. అదే విధంగా గతంలో ఆ నలుగురు ఆగస్టు 2వ తేదిన పెంటపాడు రొయ్యల చెరువు వద్ద కూడా 600 మీటర్ల వైర్లను దొంగలించిన కేసులో వున్నారని వారు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 7వ తేది పోటుపాలెం సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఆ నలుగురిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు. ఈ కేసును చాకచక్యంగా చేధించినటువంటి దశరధరామారావు, ఎస్ఐ బి. గోపాల్, ఎఎస్ఐ ఎస్‌కె సిరాజ్, హెడ్ కానిస్టేబుల్ ఆర్‌వి రాజు, కె. నావూరయ్య, టి. సుబ్రమణ్యం, సిహెచ్ కస్తూరయ్య, కానిస్టేబుల్‌లు వి. వెంకటేశ్వర్లు, వి. విష్ణుకుమార్‌లను గూడూరు డిఎస్పి అభినందించారు.